క్లుప్తంగా

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



నిర్వాహకులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు శుచి, శుభ్రత తప్పక పాటించాలని ఎంఈఓలు ఆదామ్‌బాషా, జ్యోతి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వంట గది, వంట పదార్థాలు, పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదే విధంగా వంట నిర్వాహకులు వ్యక్తిగత శుభ్రత తప్పకుండా పాటించాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందించాలన్నారు. రిసోర్స్‌పర్సన్ సుంకమ్మతో నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఆంగ్ల పరీక్షకు 30 మంది గైర్హాజరు

సి.బెళగల్: మండల కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో సోమవారం జరిగిన పదో తరగతి సప్లిమెంటరీ ఇంగ్లిష్ పరీక్షకు 30 మంది గైర్హాజరయ్యారు. సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 27 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 13 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం డిపార్టుమెంటల్ అధికారి అనంతయ్య తెలిపారు. అదే విధంగా మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 37 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 17 మంది హాజరుకాలేదని పాఠశాల పరీక్షల చీఫ్ ధనుంజయగౌడ్ వెల్లడించారు.

క్లోరినేషన్ తర్వాతే నీటిని విడుదల చేయాలి



నీటిని క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

కోడుమూరు రూరల్: క్లోరినేషన్ చేసిన తర్వాతే ప్రజలకు నీటిని సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ నీటి సరఫరా సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కోడుమూరు పంచాయతీలోని మంచినీటి సరఫరా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి 15 రోజులకోసారి ట్యాంకును శుభ్రపరచాలని, క్లోరినేషన్ చేసిన తర్వాతే కొళాయిలకు నీళ్లను విడుదల చేయాలని సూచించారు.

రేపు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ

పాణ్యం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం 10 గంటలకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ ఉంటుందని ఎంఈఓ–2 సుబ్రమణ్యం తెలిపారు. విద్యార్థులకు అందించే భోజనంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ఏ విధంగా తయారు చేయాలనే విషయాలపై శిక్షణ ఉంటుందన్నారు. అందరూ తప్పక హాజరుకావాలన్నారు.

మురుగు పారదు.. సమస్య తీరదు



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన డ్రైనేజీ కాలువ

కల్లూరు: కల్లూరు అర్బన్ 21వ వార్డు శ్రీలక్ష్మీనగర్ కాలనీలోని డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు నిండిపోయాయి. దోమలు, ఈగలు, లార్వాలు అభివృద్ధి చెంది వ్యాధులు వచ్చే అవకాశం ఉందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం నీరు, మురుగు సాఫీగా వెళ్లడానికి ప్లాస్టిక్ పేపర్లు, కవర్లు అడ్డుగా ఉంటున్నాయని.. దీంతో నిల్వ చేరి దుర్గంధం వ్యాపిస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి వాటిని తొలగించాలని కోరుతున్నారు.

ఇద్దరు డీబార్

కర్నూలు(సెంట్రల్):రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయ్యారు. డోన్ జీవీఆర్ఎస్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో ఒకరు, బేతంచెర్ల శ్రీవివేకానంద డిగ్రీ కాలేజీలో మరొకరు డీబార్ అయ్యారు. కాగా, నాలుగో సెమిస్టర్ సోమవారం జరిగిన పరీక్షకు 89 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 2,995 మంది విద్యార్థుల్లో 2,670 మంది పరీక్ష రాశారు.

విజ్ఞాన శిబిరాలు

- గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు
- వైజ్ఞానిక, సాంస్కృతిక, సృజనాత్మక కళా రంగాలపై ప్రత్యేక శిక్షణ
- సెలవుల సమయంలో సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు



చెస్ ఆడుతున్న విద్యార్థులు



నీతి కథలు బోధిస్తున్న గ్రంథాలయ అధికారి

గడివేముల: విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచేందుకు, వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాల్లో ఏప్రిల్ 29 జూన్ 6 తేదీ వరకు వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీసేందుకు గ్రంథాలయాలు వేదికలుగా మారాయి. వైజ్ఞానిక, సాంస్కృతిక, సృజనాత్మక కళా రంగాలపై ఇక్కడ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆంగ్ల భాషలో సంభాషణ, చిత్రలేఖనం, రంగులు వేయడం, కాగితంతో కళారూపాలు తయారు చేయడం, సంగీతం, నృత్యం, బొమ్మల తయారీ, నటనలో శిక్షణ ఉంటుంది. క్యారమ్స్, చెస్ ఆటలు ఆడిస్తున్నారు. పిల్లలు వేసవిలో సమయాన్ని వృథా చేసుకోకుండా ఈ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడు ఉద్దేశాలు

- ఈ శిబిరాల ద్వారా ప్రధానంగా మూడు లక్ష్యాలను నిర్ణయించుకున్నారు.
- విద్యార్థులు వేసవి సెలవుల్లో లభించే విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం.
- చదవడాన్ని అలవాటుగా మార్చుకోవడం.
- క్రమం తప్పక గ్రంథాలయాలకు వచ్చే విధంగా వారిలో ఆసక్తి కలిగించడం.

కాలనిర్ణయ పట్టిక

ఇందుకు అనుగుణంగా రోజూ గ్రంథాలయాల్లో పిల్లలకు ఉదయం కథలు వినిపిస్తారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయంలో ఉండే పుస్తకాల పఠనం జరుగుతుంది. 20 నిమిషాల పాటు పుస్తక సమీక్ష చేస్తారు. పదిన్నర నుంచి 11 గంటల వరకు వారికి కథలు వినిపించడంతో పాటు..పిల్లలతో కథలు చెప్పిస్తారు.

మాతృభాషపై పట్టు సాధించా



గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో మాతృభాషపై అవగాహన కల్పించారు. భాషపై పట్టుసాధించడానికి అవసరమైన మెళకువలు నేర్పారు. అలాగే తల్లిదండ్రులు, గురువులతో ఎలా మెలగాలో తెలుసుకున్నా. ప్రతి రోజు గ్రంథాలయాలకు వెళ్లడం ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు. పుస్తకాల ద్వారా ఎంతో జ్ఞానాన్ని సంపాదించవచ్చని గ్రహించాను. సమ్మర్ క్యాంప్ సరదాగా గడిచిపోతోంది.

–రాణిమహంతా, 6వ తరగతి, గడివేముల

ఎన్నో విషయాలు నేర్చుకున్నాను



గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొనడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఇక్కడ ఉన్న నీతి కథల పుస్తకాలను చదివి ఎంతో స్ఫూర్తి పొందుతున్నాను. ఈ విధంగా కథలు చదవడం, వినడం, చెప్పడం ద్వారా నాకు ఉన్న స్టేజ్ ఫియర్ పోయింది. కొత్త విషయాలు, గొప్ప వ్యక్తుల విజయ గాథలు తెలుసుకోవడం బాగుంది. జాతీయ నాయకుల జీవిత చరిత్రలను కథల రూపంలో చెబుతున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడుపుతున్నాం.

–చాంద్‌బాషా, 8వ తరగతి విద్యార్థి, గడివేముల

పుస్తకాలపై మక్కువ పెంచుకోండి



వేసవి శిక్షణా శిబిరాలతో బాలబాలికల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెరుగుతుంది. చదువుతో పాటు ఇతర నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తుండడం వల్ల వారిలో సృజనాత్మకతను వెలికితీయవచ్చు. బాల్యం నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకుంటే మెదడుకు పదును పెట్టవచ్చు. ఈ శిక్షణా శిబిరాల్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– వెంకటేశ్వరరెడ్డి, గ్రంథాలయాధికారి, గడివేముల

కేవీఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్



జఫూరుల్లా బేగ్

కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ ఇంగ్లిషు లెక్చరర్ ఎం.జఫ్రారుల్లా బేగ్‌కు రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది.శామ్యూల్ సెల్వన్ నవలలోని అంశాలపై యోగి వేమన యూనివర్సిటీ రిటైర్డ్ ఇంగ్లిషు ఆచార్యులు జి.గులామ్ తారిక్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు ఈ అవార్డు లభించినట్లు జఫూరుల్లా తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయనను కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

1న లొద్దిపల్లెలో భజన పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో జూన్ 1వ తేదీ జిల్లా స్థాయి భజన పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హనుమద్‌జయంతి సందర్భంగా శనివారం స్థానిక వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు స్వామివారికి సిద్ధోదక స్నానం, అభిషేకం, సింధూరపు అలంకరణ, కలశస్థాపన, ఆకుపూజ, కుంకుమార్చన పూజలు.. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ..సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం చేయనున్నారు.. అదే రోజు రాత్రి 9 గంటలకు జిల్లాస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నారు. తొలి నాలుగు స్థానాల్లో నిలిచే బృందాలకు వరుసగా రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు దాతలు ఆర్.నాగేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి తెలిపారు. ఆసక్తి గల భజన బృందాలు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9704842047, 9849581378 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పాణ్యం కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి



కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్) : పాణ్యంకు సంబంధించి కౌంటింగ్ ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆ నియోజకవర్గ ఆర్వో/జేసీ నారపురెడ్డి తెలిపారు. సోమవారం ఆమె ఆర్‌యూలో ఏర్పాటు చేసిన పాణ్యం కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా ఇంజినీరింగ్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి ఎంట్రీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. అనంతరం కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్ల పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీకి 14, పార్లమెంట్‌కు 14 టేబుళ్లను ఏర్పాటు చేసి 26 రౌండ్లలో ఫలితాలను విడుదల చేయనున్నట్లు చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలోకి సిబ్బంది, ఏజెంట్ల ఫోన్లతో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించమని, అయితే వాటిని ఏర్పాటు చేసిన సెంటర్లలో భద్రపరుచుకోవచ్చని సూచించారు. ఆమె వెంట కల్లూరు తహసీల్దార్ మునివేలు, ఆర్‌అండ్‌బీ డీఈ భారతి ఉన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు సరళమ్మ

పాణ్యం: మండల పరిధిలోని కొండజుటూరు గ్రామంలో సీఎస్ఐ చర్చి ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను పాణ్యం జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల రైతుల్లో ఉత్సాహం, గ్రామానికి పేరు ప్రఖ్యాతలు వస్తాయన్నారు. విజేతలకు రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తారని తెలిపారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి వృషభాలతో వచ్చిన రైతులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. అలాగే ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించారు. పోటీలను తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి, సీఎస్ఐ చర్చి నిర్వాహకులు, క్రైస్తవ మత పెద్దలు పాల్గొన్నారు.

ఫాం పాండ్స్‌తో అనేక ఉపయోగాలు



కూలీలతో మాట్లాడుతున్న అంబుడ్స్ పర్సన్

పాణ్యం: ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు ఫాం పాండ్స్ తవ్వుకోవాలని అంబుడ్స్‌పర్సన్ సురేంద్రకుమార్ అన్నారు. సోమావరం మండల పరిధిలోని భూపనపాడు గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెట్ట ప్రాంతంలో ఐదెకరాల్లోపు వ్యవసాయ భూములు ఉన్న రైతులు ఫాం పాండ్స్ తవ్వుకోవడం వల్ల నీటి సమస్యను అధిగమించవచ్చని తెలిపారు. అనేక ఉపయోగాలు ఉంటాయని పేర్కొన్నారు. లాభసాటి వ్యవసాయం చేయాలంటే ఉద్యాన పంటలే ప్రధానమన్నారు. అనంతరం కూలీల వేతనాల గురించి అడిగి తెలుసుకున్నారు. గిట్టుబాటు కూలీ వచ్చేలా పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఏపీఓ విజయరాణి, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

90 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): ఖరీఫ్ రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావుకు రైతులను ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..2023 ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన వారందరికీ పరిహారం చెల్లించాలన్నారు. బ్యాంకుల నుంచి తక్షణమే రుణాలు రెన్యువల్ అయ్యేలా చూడాలన్నారు. వర్షాలు పడుతుండడంతో బ్యాంకులు కొత్తగా అప్పులు ఇచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి.రాజాసాహెబ్, జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



అమడగుంట్ల ఆర్బీకేలో వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఓ



విత్తనాల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏఓ

కోడుమూరు రూరల్: విత్తన దుకాణదారులు రైతులకు నాణ్యమైన కంపెనీ విత్తనాలను మాత్రమే విక్రయించాలని, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఏఓ రవిప్రకాష్ హెచ్చరించారు. సోమవారం కోడుమూరులోని విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విత్తనాలకు సంబంధించిన స్టాక్ రికార్డులు, లైసెన్స్‌లను పరిశీలించారు. ప్రతి దుకాణదారుడు వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని, విత్తన కొనుగోలు సమయంలో రైతులకు రశీదు తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు.

అందుబాటులో రాయితీ విత్తనాలు

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం మండలానికి 5 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను కేటాయించిందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సూచించారు. సోమవారం మండలంలోని అమడగుంట్ల రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్వింటాల్ రూ. 9,500 ఉండగా, రాయితీ పోను రైతు రూ.5,700 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరో నాలుగైదు రోజుల్లో కందులు, కొర్ర విత్తనాలు కూడా మండలానికి రానున్నట్లు పేర్కొన్నారు.

నైపుణ్యాల పెంపుతో ఉద్యోగ అవకాశాలు

- జాబ్ అచీవర్స్ డే వేడుకల్లో పెద్దాసుపత్రి సూపరింటెండెంట్



ఆఫర్ లెటర్లు అందుకున్న విద్యార్థులతో పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ వెంకట రంగారెడ్డి

కర్నూలు సిటీ: కోర్సు ఏదైనా అందులో నైపుణ్యాలు పెంచుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సులువుగా లభిస్తాయని కర్నూలు ప్రభుత్వ పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డా.వి. వెంకట రంగారెడ్డి అన్నారు. నగర శివారులోని బి.తాండ్రపాడు దగ్గర ఉన్న ఎస్.జి. పుల్లా రెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సోమవారం జాబ్ అచీవర్స్ డే వేడుకలు నిర్వహించారు. పాలిటెక్నిక్ కోర్సులను అభ్యసించిన విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి అందుకు సంబంధించిన ఆఫర్ లెటర్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తు ఉండాలంటే ఎప్పటికప్పుడు వృత్తి నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఎం.వి.ఎస్.ఎస్.ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ ఎస్.జి. పుల్లారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి చెందిన 69 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయని, మంచి ప్యాకేజీలతో తమ పిల్లలు ఉద్యోగాలు పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆ కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్

ఆదోని రూరల్: మండలంలోని ఆరేకల్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 28న బాలురకు చిన్నటేకూరు, 29న బాలికలకు దిన్నెదేవరపాడు పాఠశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. బాలుర విభాగంలో ప్రవేశ పరీక్షలో ఎస్సీ–22, ఎస్టీ–25, బీసీ–45, ఓసీ–44 మార్కులకు పైగా మార్కులు సాధించిన వారు మాత్రమే హాజరుకావాలని పేర్కొన్నారు.

కచ్చితమైన ఫలితాలను ప్రకటించాలి

- జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించిన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్

కర్నూలు(సెంట్రల్): జూన్ 4వ తేదీన చేపట్టే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను త్వరితగిన కచ్చితమైన విలువలతో ప్రకటించాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎన్నికల మార్గదర్శకాలు పాటిస్తూ ఫలితాల ప్రకటనలో జాప్యం ఉండకూడదన్నారు. సోమవారం ఢిల్లీ నుంచి ఐదు దశల్లో ఎన్నికలు జరిగిన రాష్ట్రాల సీఈఓలు, జిల్లా ఎన్నికల అధికారులు, ఆయా నియోజకవర్గ ఆర్వోలతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌తోపాటు కమిషనర్లు జ్ఞానేష్‌కుమార్, డాక్టర్ సుఖ్బీర్‌సింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన కమిషనర్ మాట్లాడుతూ..కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజున ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద జనాలు లేకుండా చూసుకోవాలన్నారు. నిర్ణీత పాసు లేకుండా ఎవరినీ అనుమతించొద్దని సూచించారు. పవర్ బ్యాంకు, పవర్ సేఫ్టీ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని, అత్యవసర ఆరోగ్య సేవలు అందజేసేందుకు అంబులెన్స్‌లను కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు చేపట్టాలని, తరువాత ఈవీఎంలను లెక్కించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పాల్గొన్నారు.

చిటారు కొమ్మన చిగురు కోయగలనే!



కల్లూరు: చెట్టులెక్కగలవా.. ఓ నరహరి పుట్టలెక్కగలవా? చెట్టులెక్కి ఆ చిటారు కొమ్మన చిగురు కోయగలవా ఓ నరహరి చిగురు కోయగలవా?.. అంటూ ఓ పాటలో కథానాయిక సవాల్ విసురుతుంది.. అందుకు ప్రతిగా చెట్టు లెక్కగలనే ఓ చెంచిత పుట్టలెక్కగలనే.. చెట్టులెక్కి ఆ చిటారు కొమ్మన చిగురు కోయగలనే అంటూ కథనాయకుడు సమాధానం ఇస్తాడు. ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ పాటను గుర్తు చేసేలా కల్లూరు మండలం బస్తిపాడు గ్రామంలోని చింత వనంలో జీవనోపాధి కోసం కొందరు చింతచెట్టు ఎక్కి చిటారు కొమ్మన చిగురు కోస్తూ కనిపించారు.

ఆదర్శ వివాహం



ఆదర్శ వివాహం చేస్తున్న కుల, ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): కేవీపీఎస్, ఆర్‌వీఎస్ ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం జరిగింది. సోమవారం రజక వృత్తిదారుల సంఘం కార్యాలయంలో చాకలి వినయ్, రాచపోగుల ఎరిష ఒక్కటయ్యారు. నగరంలోని కృష్ణారెడ్డి నగర్‌కు చెందిన చాకలి వినయ్, నంద్యాల జిల్లా డోన్ మండలం ధర్మవరానికి చెందిన రాచపోగుల ఎరిష ప్రేమించుకున్నారు. అయితే వారి పెద్దలు వివాహానికి అంగీకరించకపోవడంతో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనందబాబు, ఆర్‌వీఎస్ జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్‌ను సంప్రదించారు. వీరు ఆ ప్రేమికులకు వివాహం జరిపించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ప్రజాశక్తి మేనేజర్ టి.నరసింహ, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ పాల్గొన్నారు.

అమిత హాస్పిటల్ తనిఖీ



స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని ఎన్‌ఆర్ పేటలో ఉన్న అమిత హాస్పిటల్‌ను సోమవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలించి రికార్డులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రంలో రికార్డుల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల వారు రికార్డులు, రిపోర్టులు నిబంధనల ప్రకారం నిర్వహించాలని, లేకపోతే పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట హెచ్ఈఈఓ శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత ఉన్నారు.

అగ్ని ప్రమాదంలో గేదెలకు గాయాలు



గాయపడిన గేదెకు చికిత్స అందిస్తున్న పశువైద్యులు



గేదెను పరిశీలిస్తున్న పశు వైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో గేదెలకు గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి చిన్నటేకూరు గ్రామానికి చెందిన హిమేశ్వరయ్య కొట్టం కాలిపోయింది. అక్కడ కట్టి ఉంచిన రెండు గేదెలకు 70 శాతం గాయాలయ్యాయి. సోమవారం చిన్నటేకూరు పశువైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి గాయలను పరిశీలించి వైద్యం చేశారు.